సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



అధికారులపై నాయకుల ఒత్తిడి

నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులపై కూటమి నాయకులు ఒత్తిడి చేస్తున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆరోపించారు. - 8లో



భోజనశాల, ఆర్ఓ ప్లాంట్ల వద్ద పరిశుభ్రత పాటించాలి

ట్రిపుల్ ఐటీలో భోజనశాల, ఆర్ఓ ప్లాంట్ల వద్ద పరిశుభ్రత పాటించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయకుమార్ సూచించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /23.8

జిల్లాలో సోమవారం 23.8 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.41 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

కడప గడ్డపై నిర్లక్ష్యపు నీడ..!

- ఒక్క భారీ పరిశ్రమ లేదు... మాట్లాడే ప్రజాప్రతినిధి లేరు
- మంజూరైన ఎంఎస్ఎంఈ అమరావతికి తరలిస్తూ ఉత్తర్వులు
- తాజాగా ఏపీజీబీ హెడ్ ఆఫీసు తరలింపునకు సన్నహాలు
- మంజూరైన 50 మెడిసిన్ సీట్లను తిరస్కరించిన చంద్రబాబు సర్కార్
- పడకేసిన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి
- ఆర్నెళ్ల ఎన్డీయే కూటమి సర్కార్‌లో జిల్లాకు ఒరిగింది శూన్యం



కొప్పర్తి పారిశ్రామిక కేంద్రం (ఇన్‌సెట్) పులివెందుల మెడికల్ కళాశాల

సాక్షి ప్రతినిధి, కడప : నేను రాయలసీమ బిడ్డనే.. చెప్పుకునేందుకు మాత్రమే సీఎం చంద్రబాబునాయుడు పరిమితం. ఈ ప్రాంతానికి ప్రత్యేకించి అభివృద్ధి ఫలాలు అందించడంలో విఫలమయ్యారు. రాయలసీమ ముఖ్యమంత్రులు చూపిన శ్రద్ధాసక్తులను ఆయన ఎప్పుడూ ఆచరణలో చూపెట్టలేదు. ఆర్నెళ్ల ప్రభుత్వ హయాంలో కడప గడ్డపై నిర్లక్ష్యపు నీడ తాండవం చేస్తోంది. ఒక్క పరిశ్రమ రాకపోగా...మంజూరైన ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయకుండా తిరస్కరించారు. ఏకంగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ)కి 50 సీట్లు తిరస్కరిస్తూ లేఖ రాశారు. ఎన్నికల హామీలు సైతం నీటి బుడగలుగా ఉండిపోయాయి.

చంద్రబాబుకు రాయలసీమ ప్రజల ఓట్లు కావాలి కానీ...ఈ ప్రాంతం అభివృద్ధి చేయాలనే తపన, ఆలోచన మాత్రం ఆయనకుండదు. తుదకు తన సొంత నియోజకవర్గం కుప్పానికి కూడా సాగు నీరు అందించేందుకు మనస్సు రాలేదు. నేనూ సీమ బిడ్డనే అంటూ రంకెలేసే చంద్రబాబు...సీమకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కొనసాగించలేని దుస్థితిలో ఉన్నారు. దశాబ్దాలుగా పులివెందుల ప్రజలు వైఎస్ కుటుంబానికి పట్టం కడుతూ గుండెల్లో పెట్టుకున్నారు. రూ.530 కోట్లతో పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మిస్తే ఎన్ఎంసీ మంజూరు చేసిన 50 ఎంబీబీఎస్ సీట్లు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ తిరస్కరించింది.

ఎంఎస్ఎంఈ తరలింపు...

కడప అంటే తొలి నుంచి చంద్రబాబు వివక్ష ప్రదర్శిస్తూనే ఉన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ పాలకుడైనా, ఇక్కడి ప్రజల పట్ల చీత్కారం తెరపైకి వస్తూనే ఉంది. మునుపంతా ఓట్లు-సీట్లు ఇవ్వలేదు.. మీకెందుకు పనులు చేయాలంటూ సీఎం హోదాలో బాహాటంగా వ్యాఖ్యానించిన చంద్రబాబు తాజాగా ఓట్లు-సీట్లు లభించినా అదే వివక్ష చూపుతున్నారు. క్రమం తప్పకుండా కడప అంటే కడుపు మంట ప్రదర్శిస్తున్నారు.

- భారత ప్రభుత్వం కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.250 కోట్లతో మంజూరు చేసిన రెండవ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని సైతం అమరావతికి తరలించారు. వెనుకబడిన కడప జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈ ను అభివృద్ధి చెందిన అమరావతికి తరలించుకుపోయారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎప్పుడు బాధ్యతలు చేపట్టినా జిల్లాకు అన్యాయం చేస్తున్నారని విశ్లేషకులు విమర్శిస్తున్నారు. వారి విమర్శలకు ఆయన చర్యలే బలం చేకూరుస్తున్నాయి. 2014-19 హయాంలో కడపకు మంజూరైన ఉర్దూ యూనివర్శిటీని సైతం కర్నూలుకు తరలించారు. తాజాగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు హెడ్ ఆఫీసు తరలింపునకు రంగం సిద్ధం చేశారు. గ్రామీణ బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ పేరుతో ఏపీజీబీ హెడ్ ఆఫీసుకు ఎగనామం పెట్టేందుకు సిద్ధమయ్యారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

బాధ్యత ఎరుగని ప్రజా ప్రతినిధులు..

క్రమం తప్పకుండా జిల్లా నుంచి పబ్లిక్ సెక్టార్ తరలిస్తుంటే ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధులు బాధ్యతను గుర్తించలేకపోతున్నారు. కొత్త పరిశ్రమలు తీసుకరాకపోయినా కనీసం ఉన్న సంస్థలనైనా కాపాడుకోవాల్సిన దిశగా అడుగులు పడడం లేదు. ఆదాయ మార్గాలపై ఉన్న శ్రద్ధ ప్రాంతంపైనా, ప్రజలపైనా చూపెట్టలేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మంజూరైన 50 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయాలని ఒక్కరంటే ఒక్కరు కూడా నోరు తెరిచిన పాపాన పోలేదు. ఎంఎస్ఎంఈ తరలించడం తగదని కోరనూ లేదని పలువురు వాపోతున్నారు.

హామీలు నీటి బుడగలే...

ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలతోపాటు జిల్లాలో సత్వరమే ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చిన ఉక్కు పరిశ్రమ ఊసే లేదు. రైతులు పంటలు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తాం. బిందు సేద్యం నిర్వహణకు 90శాతం సబ్సిడీ ఇస్తాం. రాయలసీమకు సాగునీటి సమస్యను తీరుస్తాం.. ఇలాంటి మాటలు 1995 నుంచి చంద్రబాబు చెబుతూనే ఉన్నారు. అవే ఇప్పటికీ రిపీట్ అవుతున్నాయి. టూరిజం సర్క్యూట్, హార్టికల్చర్ హబ్ కలగానే మిగిలిపోయిందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

- జీఎన్ఎస్ఎస్ పథకంలో తొలిదశలో సాగునీటి రిజర్వాయర్లు నిర్మించారు. ఆయకట్టుకు అనువుగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటు చేయాలనే తలంపే లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సాగునీటి రంగాన్ని పూర్తి నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణలు లేకపోలేదు.
- సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం ద్వారా జిల్లాలో 2,10,481 మందికి రూ.420.96 కోట్లు దక్కాల్సింది ఇప్పటికీ ఆ ఊసేలేదు. ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతి నెలా 7,06,974 మందికి రూ.1500 చొప్పున ప్రతినెలా రూ.106.05 కోట్లు అందాలి. ఆర్నెళ్ల కాలానికి రూ.636 కోట్లు పైబడి దక్కలేదు. నిరుద్యోగ భృతి ద్వారా ప్రతినెలా 2.80లక్షల మందికి రూ.84కోట్లు రావాల్సి ఉంది. ఈలెక్కన రూ.504 కోట్లు అందలేదు. చంద్రబాబు హామీలు నీటి బుడగలేనని మరోమారు తేటతెల్లమయ్యాయని విశ్లేషకులు వివరిస్తున్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కరువైంది



హిట్లర్ తరహాలో నియంత పాలన సాగుతోంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాల అమలు ఊసే లేదు. కక్ష సాధింపు రాజకీయాలతో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది. ఈ ఆరు నెలల్లో అక్రమ కేసులు దౌర్జన్యాలు, హత్యలు తప్ప మరి ఏమీ లేవు.

– కె.సురేష్‌బాబు, నగర మేయర్, కడప

రాష్ట్రంలో అరాచక పాలన



రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. ప్రజల తరపున ప్రశ్నించే వారు లేకుండా ప్రతిపక్షాన్ని అణగదొక్కాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతున్నారు. మహిళలు, రైతులు నిరుద్యోగులను మోసం చేశారు. ప్రతి దానికి గత ప్రభుత్వంపై నెపం నెడుతున్నారు. అందుకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

– ఎస్‌బీ అంజద్‌బాష, మాజీ డిప్యూటీ సీఎం

గొప్పలు చెప్పకోవడం సిగ్గుచేటు



చంద్రబాబు అర్ధ సంవత్సర పాలన పూర్తిగా అర్థ రహితంగా ఉంది. హామీలు గాలికి వదిలేసి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. సూపర్ సిక్స్ హామీలకు దిక్కులేకుండా పోయింది. మ్యానిఫెస్టోలో పెట్టిన 60 హామీలు ఏమయ్యాయే అర్థం కావడం లేదు. మూడు సిలిండర్లలో ఈ ఏడాది సింగిల్ సిలిండర్‌తో మమ అనిపించారు. నిరుద్యోగ భృతి ఊసే లేదు. 20 లక్షల ఉద్యోగాలు అవిగో, ఇవిగో అంటున్నారు. స్కూల్‌కి వెళ్లే ప్రతి బిడ్డకు రూ. 15 వేలు ఇస్తామని తల్లులకు పంగనామాలు పెట్టారు.. అన్నదాతా సుఖీభవను అటకెక్కించారు.. ప్రతి నెలా 1500 రూపాయలు ప్రతి ఆడబిడ్డకు ఇస్తా మన్నారు.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఎప్పుడూ అంటే పండుగలు, పబ్బాల పేరు చెప్పి కాలయాపన చేస్తున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు దిక్కులేకుండా పోయింది. ఉచిత ఇసుక పథకంలో ఉచితం ఎక్కడా లేదు. చంద్రబాబు ఆరు నెలల పాలన ఎలా ఉందంటే .. 'మండలానికి 3 మద్యం షాపులు.. 30 బెల్టు షాపులు. అభివృద్ధిలో 3 మాటలు... 30 గ్రాఫిక్స్ డిజైన్లు'లాగా ఉంది. గొప్పలు చెప్పడం మానుకుని హామీలు అమలు చేయండి.

– రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అన్నదాతకు అండగా..

- నేడు వైఎస్సార్‌సీపీ ఛలో కలెక్టరేట్
- తరలిరానున్న రైతన్నలు



నేడు వైఎస్సార్‌సీపీ ప్రదర్శన

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు రైతులను భారీ సంఖ్యలో సమీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్‌ను కలిసి రైతాంగ సమస్యలపై వినతిపత్రం సమర్పించనున్నారు.

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏమని అధికారంలోకి వచ్చిందోగానీ జిల్లా రైతుల కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. చంద్రబాబు పాలనా పగ్గాలు చేపట్టగానే ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకు జిల్లా వర్షపాత వివరాలు పరిశీలిస్తే 14.1 శాతం లోటు ఏర్పడింది. చాలాచోట్ల రైతులు పంటలు సాగు చేసుకోలేకపోయారు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 1,23,535 హెక్టార్లు కాగా, 53,968 హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. జిల్లాలోని చాలా మండలాల్లో రెండేసి చొప్పున డ్రై స్పెల్స్ ఏర్పడ్డాయి. దీంతో వేరుశనగ, జొన్న, మినుము తదితర వర్షాధార పంటలు నిలువునా ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క మండలాన్ని కూడా కరువు కింద ప్రకటించలేదు. నవంబరు 5వ తేదీ జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో కరువు గురించి కనీసం చర్చించిన పాపాన పోలేదు. ఇన్‌ఛార్జి మంత్రి సవిత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలకు పరిమితమయ్యారు. ఒక్క తీర్మానం కూడా ఆమోదించకుండా డీఆర్సీ ముగించి చేతులు దులుపుకున్నారంటే రైతుల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. కేవలం జగన్‌పై ఉన్న కక్షతోనే కరువు మండలాల ప్రకటన చేయలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కేసీ కెనాల్ మండలాలు మినహా మిగతా వాటిని కరువు జాబితాలో చేర్చాలంటూ వామపక్ష రైతు సంఘాలు ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదు. జిల్లాకు చెందిన కూటమి ప్రజాప్రతినిధులకు మద్యం, ఇసుక, ఇతర కాంట్రాక్టుల్లో కోట్లు దండుకోవడంపై చూపుతున్న శ్రద్ధ.. రైతుల పట్ల లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీఎం కిసాన్‌తో కలిపి రైతు భరోసా కింద రూ. 13,500 మాత్రమే ఇస్తోందని, తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు యేటా రూ. 20 వేలు ఇస్తామంటూ కూటమి నేతలు హామీ ఇచ్చారు. రైతులు వారి మాటలు నమ్మి ఓట్లు వేసి అధికారాన్ని అప్పగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై బుధవారంతో ఆరు నెలలు పూర్తి చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రెండు విడతలు నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా ఇంత వరకు ఇవ్వలేదు. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా నామమాత్రపు నిధులు విదిలించి చేతులు దులుపుకుంది. దీంతో అన్నదాత సుఖీభవ హామీని విస్మరించింది.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతు భరోసా పథకం కింద 2019 నుంచి 2023 వరకు జిల్లాలో 8,17,397 మంది రైతులకు రూ. 1064.78 కోట్లు ఖాతాల్లో జమచేసింది. నిర్దేశించిన పంటలకు సంబంధించిన బీమా కోసం ప్రభుత్వ వాటానే కాకుండా రైతుల ప్రీమియం కూడా తామే చెల్లించి తమది రైతు ప్రభుత్వమని జగన్‌మోహన్‌రెడ్డి చాటుకున్నారు. నేడు కూటమి ప్రభుత్వం స్వచ్ఛంద బీమా పేరిట రైతులను బీమా సౌకర్యానికి దూరం చేసే విధానాలకు తెర లేపింది. ప్రీమియం మొత్తాన్ని రైతులే చెల్లించుకోవాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం సున్నా వడ్డీ పంట రుణాలు అందించి రైతులను ఆదుకుంది. కూటమి ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, పంట కాలువల ఏర్పాటు విషయంలో శ్రద్ధ చూపడం లేదు. రాజోలు రిజర్వాయర్ ముంపు గ్రామాల రైతులకు నష్టపరిహారం చెల్లింపు విషయంలో కూడా నిర్లక్ష్యంగా ఉంది.

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం

- నేటి నిరసనకు భారీగా తరలిరండి
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల రూరల్ : శుక్రవారం చేపట్టనున్న అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలో పాలన పరంగా విఫలం అయిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' అనే నిరసన కార్యక్రమం పార్టీ అధిష్టానం చేపట్టడం జరిగిందన్నారు. కడప జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసనకు మద్దతుగా రైతులు, రైతు కూలీలతోపాటు ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తమ సొంత వాహనాలలో శుక్రవారం ఉదయం 8 గంటలకు పట్టణంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయానికి చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి అందరూ బయలుదేరి వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

రైతుల పక్షాన వైఎస్ఆర్ సీపీ పోరాటం

– వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి - 8లో

న్యూస్‌రీల్

15న జిల్లాస్థాయి అండర్-12 క్రికెట్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 15వ తేదీన జిల్లాస్థాయి అండర్-12 బాలుర విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్, సొంత క్రికెట్ కిట్ బ్యాగ్‌లతో హాజరుకావాలని కోరారు. 01-09-2012 నుంచి 31-08-2015 మధ్య జన్మించిన వాళ్లు ఎంపికలకు అర్హులన్నారు.

యువపురస్కారం-25కు దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : జనమంచి గౌరీశంకర్ (గౌరీజీ) స్మారక యువ పురస్కారం-2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభలు 2025 జనవరి 24 నుంచి 26 తేదీల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏబీవీపీకి విశేష సేవలందించిన గౌరీజీ పేరు మీద ప్రతియేటా ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పురస్కారం కింద రూ.50 వేలు నగదు పురస్కారం , ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ భావాలు కలిగిన 40 సంవత్సరాలలోపు యువత పురస్కారానికి అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలను జనవరి 12వ తేదీలోపు ఆంధ్రప్రదేశ్.ఏబీవీపీ జీమెయిల్‌కు పంపాలని కోరారు. వివరాలకు 94403 36189 98855 60671 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వాయిదా పడిన డిగ్రీ పరీక్షలు 21,23 తేదీలలో నిర్వహణ

వైవీయూ : పలు కారణాలరీత్యా వాయిదా పడిన యోగివేమన విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాలల సెమిస్టర్‌ల పరీక్షల కోసం కొత్త తేదీలను వైవీయూ సీఈ ఆచార్య కె. కృష్ణారావు వెల్లడించారు. ఈనెల 2వ తేదీన జరగాల్సిన పరీక్షలు ఈనెల 23వ తేదీన నిర్వహిస్తామన్నారు. ఈ నెల 3వ తేదీన జరగాల్సిన పరీక్ష 21వ తేదీ ఉంటుందని సీఈ తెలిపారు. విద్యార్థులు సంబంధిత తేదీలలో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

తెలుగును భావితరాలకు అందించే బాధ్యత యువతదే

కడప కల్చరల్ : తెలుగును భావితరాలకు అందించే బాధ్యత యువతపైనే ఉందని వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం 'తెలుగు సూర్యుడు' సీపీ బ్రౌన్ 141వ వర్ధంతి సభను గురువారం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. తొలుత అతిథులతో కలిసి రాజీవ్‌మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, అనంతరం గ్రంథాలయంలోని బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ 19వ శతాబ్దంలో బ్రౌన్ గనుక లేకుంటే తెలుగుభాష పరిస్థితి మరోలా ఉండేదన్నారు. నేడు తెలుగు భాషా సాహిత్యం ఈ స్థాయిలో ఉండడం వెనుక బ్రౌన్ కృషి ప్రధానమన్నారు. సభాధ్యక్షులు, వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి, గౌరవ అతిథి, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ , బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ బ్రౌన్ జీవిత విశేషాలను, సాహితీసేవను, బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణం వెనుక ఉన్న జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సీకే సంపత్ కుమార్ మొదలైన ప్రముఖుల కృషిని సభకు వివరించారు.



సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, ఇతర అతిథులు

తెలుగుకు పట్టం కట్టాలి

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు- తులనాత్మక అధ్యయన విభాగం అధ్యాపకులు ఆచార్య జి.బాలసుబ్రహ్మణ్యం ప్రధాన వక్తగా మాట్లాడుతూ బ్రౌన్ తెలుగు భాషా సాహిత్యాలతోపాటు జానపద గేయాలను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ గోపాలకృష్ణశాస్త్రి సభను పర్యవేక్షించారు. బ్రౌన్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పద్య పఠన పోటీలలో విజేతలైన విద్యార్థులకు వీసీ అతిథులతో కలసి బహుమతులు ప్రదానం చేశారు. ఆచార్య టి.రామప్రసాద రెడ్డి, ఆచార్య పి.రమాదేవి, ఆచార్య ఎంఎం వినోదిని, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ఇసుకాసురులు

- నేతల ఫలహారంగా సహజ సంపద
- అధికార పార్టీ ఎమ్మెల్యే దోపిడీకి అడ్డే లేదు
- గ్రావెల్‌తో ఆరంభమై యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పేరుకే అధికారిక రీచ్‌లు... నదులలో మిషన్లు పెట్టి బాహాటంగా తరలింపు
- పైడికాల్వ రీచ్ వదిలి రాచవారిపల్లె వద్ద అనధికారిక రీచ్ ఏర్పాటు
- పాపాఘ్నిలోకి రహదారి ఏర్పాటు చేసి తరలిస్తున్న వైనం
- నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు



ఇసుక అక్రమ రవాణాకు వల్లూరు మండలం రాచవారిపల్లెలో తాజాగా ఏర్పాటు చేసిన రహదారి

సాక్షి ప్రతినిధి, కడప : కూటమి ప్రభుత్వంలో ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నాయి. టీడీపీ ప్రజాప్రతినిధుల అక్రమాలకుయ యేరు..చెట్టు..చేమా..కొండ..కోనా నిలువునా కరిగిపోతున్నాయి. నిన్నమొన్నటి వరకూ గ్రావెల్ మాఫియా రాజ్యమేలగా తాజాగా ఇసుక కొల్లగొడుతున్నారు. ప్రభుత్వ రీచ్ పేరిట పక్కనున్న గ్రామాల నుంచి యథేచ్ఛగా మిషన్లు పెట్టి లోడింగ్ చేస్తూ అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. కమలాపురం నియోజకవర్గంలో ఆకాశమే హద్దుగా అక్రమ రవాణా చెలరేగుతోంది. ప్రకృతి సంపద అధికార పార్టీ నేతల పాలిట కల్పతరువుగా మారింది. నదులు గుల్ల అవుతున్నాయి. యథేచ్ఛగా ఇసుక భారీగా తరలిస్తున్నారు. అక్రమ సంపాదన కోసం పోటీ పడుతున్నారు. చిత్రావతి, పెన్నా, పాపాఘ్ని, చెయ్యేరు నదులను చెరబట్టారు. ప్రొక్లెయిన్ల ద్వారా లోడింగ్ చేస్తూ భారీ టిప్పర్లతో ఇష్టారాజ్యంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. స్థానికంగా వినియోగదారుడికి ఇసుక కావాలంటే చుక్కలు చూడాల్సి వస్తోంది. ×ఉచిత ఇసుక¥ దోపిడీ పథకంగా మారింది. ప్రభుత్వ రీచ్‌లు దక్కించుకుని పొరుగునే ఉన్న మరో గ్రామం నుంచి ఇసుక బాహాటంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పైడికాల్వ, కొత్తగంగిరెడ్డిపల్లె, నందిమండలం ఇసుక రీచ్‌లు నిలుస్తున్నాయి. ప్రభుత్వ ఇసుక రీచ్ నిర్వహణను దక్కించుకున్న తెలుగుతమ్ముళ్లు ఆ మాటున అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.

అక్రమార్జన కోసం పోటాపోటీ...

అధికారం రాగానే కూటమి నేతల మధ్య అక్రమార్జన కోసం పోటీపడింది. ఈక్రమంలో మొదట పెన్నానదిపై పడ్డారు. కొండాపురం మొదలు హనుమాన్‌గుత్తి వరకూ ఇసుక అక్రమంగా తరలింపు చర్యలను ఎంచుకున్నారు. పులివెందుల పరిధిలో చిత్రావతి, పాపాఘ్ని నదుల ద్వారా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. నదుల్లోకి టిప్పర్లు వెళ్లేందుకు రహదారులు ఏర్పాటు చేసి మరీ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. సహజ సంపద ఇసుక ఆధారంగా పెద్ద ఎత్తున అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నా ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదనే ఆరోపణలున్నాయి.

గ్రావెల్ ఖాళీ.. ఇసుక దిశగా..

కడప చుట్టుపక్కల మండలాలైన చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి మండలాల్లో గ్రావెల్ ఖాళీ చేశారు. కొండలన్నీ గుల్ల అయ్యాయి. మైనింగ్ అనుమతుల్లేకుండా అక్రమార్జన కోసం యథేచ్ఛగా మిషన్లతో తోడేశారు. చింతకొమ్మదిన్నె చెరువుతో ఆరంభమైన ఈ వ్యవహారం కొలుములపల్లె గ్రామం సమీపంలోని పిచ్చమ్మ గుట్టను గుల్ల చేశారు. పబ్బాపురం చెరువును చెరబట్టారు. పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారిపల్లె గుట్టను కొల్లగొట్టారు. ప్రతిరోజు లక్షలాది రూపాయలు అక్రమార్జన దిశగా అడుగులు వేశారు. ఇప్పుడు పాపాఘ్ని నదిని ఆధారంగా చేసుకుని దోపిడీ పర్వం కొనసాగుతోందని ప్రజలు వాపోతున్నారు.

అధికారికంగా పైడికాల్వ... రాచవారిపల్లె నుంచి తరలింపు...

ప్రభుత్వం పైడికాల్వ ఇసుక రీచ్‌కు అనుమతించింది. అక్కడ ఇప్పటికీ 49,733 మెట్రిక్ టన్నులు ఇసుక ఉన్నట్లు అధికారికంగా చెబుతున్నారు. కాగా, పైడికాల్వ నుంచి కాకుండా రాచవారిపల్లె నుంచి అధికారపార్టీ నేతలు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. అందుకోసం రాచవారిపల్లె నుంచి పాపాఘ్ని నదిలోకి రహదారి ఏర్పాటు చేసి మరీ మిషన్లు ద్వారా లోడింగ్ చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇదే పరిస్థితి కొత్తగంగిరెడ్డిపల్లె, నందిమండలం ఇసుక రీచ్‌లలో ఉంది. మార్కింగ్ ఇచ్చిన ఏరియాల్లో కాకుండా మరింత ఆవలివైపు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇవన్నీ కూడా టీడీపీ నేతల కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయి. అయినప్పటికీ అధికారులు అటువైపు పర్యవేక్షణ, పరిశీలన లేకుండా అక్రమార్జనకు అవకాశం కల్పిస్తుండడం విశేషం.

రెవెన్యూ సదస్సుల్లో 2168 అర్జీలు

కడప సెవెన్‌రోడ్స్ : భూ, ఇతర రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో బుధవారం వరకు 128 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా రెవెన్యూ సదస్సులలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇతర జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ నెల 6 వ తేదీ నుండి 11 వ తేదీ వరకు జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ లలో షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రెవెన్యూ అధికారులు అర్జీలను ఆర్‌టీజీఎస్ గ్రీవెన్స్ పోర్టల్ లో నమోదు చేశారు. 2168 అర్జీలు స్వీకరించారు.

విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు వెళ్లిన అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : సీఎం చంద్రబాబు శుక్రవారం విజయవాడలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ - 2047 విడుదల కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుండి వివిధ శాఖలకు చెందిన అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు విజయవాడకు తరలి వెళ్లారు. గురువారం కలెక్టరేట్ నుంచి బయలుదేరిన బస్సులను జేసీ అదితిసింగ్ జెండా ఊపి సాగనంపారు. 9 బస్సుల్లో సుమారు 340 మంది తరలివెళ్లారు.

క్లుప్తంగా

కూటమి నాయకుని బోటు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న బోటు

జమ్మలమడుగు రూరల్ : పర్యాటక ప్రాంతమైన మైలవరం జలాశయంలో ఎలాంటి అనుమతులు లేకుండా తిరుగుతున్న గండికోట గ్రామానికి చెందిన ఎన్‌డీఏ కూటమి నాయకుడి బోటును స్వాధీనం చేసుకున్నట్లు మైలవరం జలాశయం అధికారులు తెలిపారు. గురువారం సిబ్బందితో కలిసి బోటు తిరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి బోటును జలాశయం నుంచి గట్టుకు తీసుకొచ్చారు. డ్రైవర్‌ను విచారించగా ఎలాంటి అనుమతులు లేవని తెలిసింది. దీంతో జలాశయం అధికారులు స్వాధీనం చేసుకుని తమ ఆధీనంలో ఉంచుకున్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం



గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఎన్టీఆర్ విగ్రహం

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం కొత్తసంగటిపల్లె గ్రామ పంచాయతీలోని రేపల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రాతి విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం ధ్వంసం చేసిన విగ్రహాన్ని గమనించిన స్థానిక టీడీపీ నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని సీఐ చల్లనిదొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిలు పరిశీలించారు. పోలీసులు పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య



శివశంకర్ (ఫైల్)

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన సానే శివశంకర్(30) బుధవారం మద్యం మత్తులో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు సానే శివశంకర్‌కు రెండేళ్ల క్రితం కడపకు చెందిన అక్క కూతురు రోహిణితో వివాహమైంది. తనకు ఇంత వరకు పిల్లలు లేరని బాధపడేవారు. దీనికితోడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఇతను తరచూ అక్కడక్కడా అప్పులు చేసేవాడు. రోజు మాదిరే బుధవారం రాత్రి కూడా మద్యం తాగి రావడంతో తండ్రి మందలించాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొద్దుపోయాక కూడా ఇంట్లో నుంచి బయటికి రాకపోవడంతో తలుపును పగలగొట్టి చూడగా అప్పటికే శివశంకర్ మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, అమ్మ, నాన్న ఉన్నట్లు తెలిపారు.

ఇదేం రాజకీయం.!

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పచ్చ డ్రామా

- అడుగులకు మడుగులొత్తుతున్న పోలీసు, రెవెన్యూ యంత్రాంగం
- ప్రతిపక్ష పార్టీలు పోటీ చేయకుండా కుట్రలు, కుతంత్రాలు
- నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా వీఆర్‌ఓలపై తీవ్ర ఒత్తిడి
- రేపు ఎన్నికల నేపథ్యంలో కొత్త నాటకానికి తెరతీసిన అధికార పార్టీ
- అధికార పార్టీ వికృత చేష్టలపై విస్తుపోతున్న జనం



సాక్షి కడప/సాక్షి ప్రతినిధి కడప : ఎన్నికలు ఏవైనా అధికార పార్టీ కైవసం చేసుకునేందుకు కొత్త ఎత్తుగడలకు తెర తీస్తోంది. ఎలాగైనా సొంతం చేసుకోవాలన్న తలంపుతో...అధికార బలంతో అడ్డంగా ముందుకు వెళుతున్నారు. ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన నాయకులకు అర్హతలు ఉన్నా.. అనర్హతల కింద పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని వాడుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కేవలం అధికారంలో ఉన్నామన్న అహంతో పోలీసు, రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తెస్తూ తమ దారిలో పెట్టుకుని ఇతరులకు అవకాశం లేకుండా చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు సైతం ఏకపక్షంగా చేసుకునేందుకు అవసరమైన అన్ని కుట్రలను అధికార పార్టీ ప్రయోగిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్ష పార్టీకి అవకాశం లేకుండా చేసేందుకు అడ్డదారుల్లో వెళుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ప్రధానంగా ఎన్నికలకు ఒక్కరోజే సమయం ఉండడంతో నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి పచ్చ రాజకీయానికి తెర లేపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇది కాదా కుట్ర!

జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని వర్గాలు సిద్ధంగా ఉన్నాయి. కాకపోతే అధికార బలంతో ప్రతిపక్ష పార్టీ నాయకులకు సంబంధించిన మద్దతుదారుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా తెరవెనుక అధికార పార్టీ రాజకీయ బలాన్ని ఉపయోగిస్తోంది. అధికారంలో ఉన్నాం కదా అని అటు రెవెన్యూ, ఇటు పోలీసులపై తీవ్ర ఒత్తిడి చేస్తూ ఏదో ఒక రకంగా ప్రతిపక్ష పార్టీ నేతలపై అక్రమ కేసులకు పూనుకోవడం, నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా జాగ్రత్త పడటం వంటి చర్యలకు ఉపక్రమించారు. గురువారం తొండూరు మండలం ఇనగలూరు సాగునీటి సంఘానికి సంబంధించి దశరథరామిరెడ్డి అనే రైతు సర్టిఫికెట్‌కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా... వీఆర్వో స్విచ్ఛాఫ్ చేసి పట్టించుకోని పరిస్థితి నెలకొంది. వేముల మండలం గొల్లల గూడూరులో నో డ్యూ సర్టిఫికెట్ కోసం కార్యాలయానికి వెళ్లిన రైతులపై దౌర్జన్యం చేస్తూ పేపర్లు చింపివేశారు. వేంపల్లె పరిధిలోకూడా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి మనుషులు నోటీసులను చింపివేయడం, కార్యాలయాల వద్ద ఉండరాదంటూ తరిమివేయడం చూస్తే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. పోలీసులతోపాటు రెవెన్యూ, ఇతర అధికారులపై ఒత్తిడి చేయడం చూస్తే ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

మనం మాత్రమే పన్ను కట్టాలి

జిల్లాలోని వేముల మండలంలో సాగునీటి సంఘాలకు సంబంధించి కీలక నాయకుడు పంపిన సందేశం సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. అందరూ వేములలోని తన స్వగృహానికి రావాలని, మనం మాత్రమే పన్ను కట్టాలి, మన అభ్యర్థులు గెలవాలి అన్న తరహాలో పంపిన సమాచారం సంచలనంగా మారింది. ప్రతి ఊరివారు ఇక్కడికి రావాలని, అందరికీ టిఫెన్, భోజన ఏర్పాట్లు చేశామని...ఇతర ఊర్ల వాళ్లు వస్తే గుర్తు పట్టలేమని, కనుక ఎన్నిక ఉన్న గ్రామాల వారు వచ్చి నిర్ధారించాల్సి ఉంటుందని వాట్సాప్ సందేశం పంపారు. ఇప్పటికే ఇదే మండలంలో ఎన్నికలు జరగకుండా రోజుకొక రకంగా ఉద్దేశ పూర్వకంగా భయాందోళనలు సృష్టిస్తున్న నేపథ్యంలో ఈ సందేశం కాస్త సంచలనంగా మారింది. అధికారులు కనీసం ఇలాంటి వాటిపై దృష్టి సారించి ప్రశాంత ఎన్నికలు జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, లేదంటే ఎన్నికలు వాయిదా వేయాలని ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తున్నారు.

నీటి పన్ను చెల్లించకుండా అడ్డుకున్న టీడీపీ వర్గీయులు

రెవెన్యూ కార్యాలయంలో కాగితాలను చించివేసిన పార్థసారథిరెడ్డి అనుచరులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : నీటి సంఘాలకు పోటీ చేసే క్రమంలో నీటి పన్ను చెల్లించేందుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులను టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుల చేతిలోని కాగితాలను లాక్కొని టీడీపీ నాయకుడు పేర్ల పార్థసారథిరెడ్డి అనుచరులు చించివేసిన సంఘటన వేముల మండలం రెవెన్యూ కార్యాలయంలో గురువారం చోటు చేసుకుంది. ఈనెల 14వ తేదీన శనివారం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నీటి సంఘాల ఎన్నికల్లో నామినేషన్ వేయాలంటే అభ్యర్థితోపాటు బలపరిచే అభ్యర్థి కూడా నీటి పన్ను చెల్లించాలి. దీంతో గురువారం గొల్లలగూడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఈసీ మహేశ్వరరెడ్డి, గజ్జెల చంద్రశేఖరరెడ్డిలు గురువారం నీటి సంఘాల టీసీలకు పోటీ చేసే తమ మద్దతుదారుల నీటి పన్ను చెల్లించేందుకు రెవెన్యూ కార్యాలయానికి వచ్చారు. అక్కడ వీఆర్‌ఓ రమాదేవితో తమ అభ్యర్థుల నీటి పన్ను చెల్లించాలని మాట్లాడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు పేర్ల పార్థసారథిరెడ్డి అనుచరులతో రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల చేతిలో ఉన్న కాగితాలను లాక్కొని చించివేశారు. నీటి సంఘాలకు ఎవరూ పోటీవద్దని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ఈలోపు వేముల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని పార్థసారథిరెడ్డి, అనుచరులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డిలను కార్యాలయం నుంచి బయటకు పంపించి వేశారు. ఈ విషయంపై మహేశ్వరరెడ్డి ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని ఆయన తెలిపారు.

రెవెన్యూ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వేంపల్లె మండలం గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుళరెడ్డి పద్మనాభరెడ్డి, వివేకానందరెడ్డిలు నీటి సంఘం ఎన్నికల నామినేషన్ కోసం నీటి పన్ను చెల్లించేందుకు రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్లారు. రసీదులు తెచ్చుకుంటుండగా టీడీపీకి చెందిన బీటెక్ రవి అనుచరులు అక్కడికి చేరుకున్నారు. వీఆర్‌ఓ దగ్గర నుంచి వారు రసీదులను లాక్కొని చించివేసి మీరు వెళ్లిపోవాలని, నామినేషన్ వేసేందుకు వీలు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులను బెదిరించారు. దీంతో అక్కడ కొద్దిసేపు తోపులాట జరగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

● నీటి సంఘం ఎన్నికల తీరు ఇదేనా?

ఖాజీపేట : నీటి సంఘం ఎన్నికలను నిర్వహించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు.. అందుకే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.. ఎన్నికల తీరు ఇదేనా అంటూ ఖాజీపేట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ మాజీ అధ్యక్షుడు రాఘవరెడ్డి విమర్శించారు. ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే ముందు కనీసం రాజకీయ పార్టీలను పిలిచి అభిప్రాయ సేకరణ కూడా చేయలేదన్నారు. అభ్యర్థులకు ముందు గుర్తులు కేటాయిస్తామన్నారు. ఇప్పుడేమో నంబర్లు ఇస్తామంటున్నారు. ఇలా అయితే పోటీ చేసే వారు ఎప్పుడు ఓటర్లను కలసి ప్రచారం చేసుకోవాలని ప్రశ్నించారు. ఇది కేవలం ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించుకునేందుకు అధికార పార్టీ వారు చేసిన ఎత్తుగడ అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బుజ్జి, సుబ్బారెడ్డి, దుంపలగట్టు నాయకుడు రెడ్యం రామకృష్ణారెడ్డి, శెట్టిపల్లి సిద్దారెడ్డి, రావులపల్లె మధు పాల్గొన్నారు.



ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసు

పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరామర్శించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

తొండూరు : నీటి సంఘాల ఎన్నికల్లో కూడా అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి పెత్తనం చెలాయిస్తున్నారు. నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పన్నులు చెల్లించేందుకు గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు భద్రంపల్లె వెంకట్రామిరెడ్డి, ఇనగలూరు దశరథరామిరెడ్డి, భద్రంపల్లె రజనీకాంత్‌రెడ్డిలు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఇనగలూరు గ్రామ రెవెన్యూకు సంబంధించి నీటి పన్ను చెల్లించేందుకు తహసీల్దార్ రామచంద్రుడు వద్దకు వెళ్లగా ఆయన మీ గ్రామానికి సంబంధించిన వీఆర్‌ఓ వద్దకు వెళ్లి నీటి పన్నులు చెల్లించాలని సూచించారు. దీంతో అక్కడ ఆ గ్రామానికి సంబంధించిన వీఆర్‌ఓ లేకపోవడంతో అక్కడి రెవెన్యూ అధికారులతో మాట్లాడుతుండగా గొడవలు చేశారంటూ పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రవీంద్రారెడ్డి, రామమునిరెడ్డి, శివశంకర్‌రెడ్డిలతోపాటు మరికొంతమంది నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లారు. వారు విషయాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తొండూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ పెద్ద ఓబన్నతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి చెందిన భద్రంపల్లె వెంకట్రామిరెడ్డి, ఇనగలూరు దశరథరామిరెడ్డి, భద్రంపల్లె రజనీకాంత్‌రెడ్డిలు రెవెన్యూ కార్యాలయం వద్ద విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఫిర్యాదు రావడంతో వారిని స్టేషన్‌కు పిలిపించామని ఎంపీకి ఎస్ఐ వివరించారు. అనంతరం నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండి ప్రశాంతంగా ఎన్నికల్లో పాల్గొని పార్టీ మద్దతుదారులను గెలిపించుకోవాలన్నారు. టీడీపీ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని చేతకాని రాజకీయం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసు నమోదు

వైఎస్సార్‌సీపీకి చెందిన భద్రంపల్లె వెంకట్రామిరెడ్డి, ఇనగలూరు దశరథరామిరెడ్డి, భద్రంపల్లె రజనీకాంత్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. గురువారం సాయంత్రం తొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద వీరు రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తుండటంతో కేసు నమోదు చేశామన్నారు.

నో డ్యూస్ సర్టిఫికెట్ వెంటనే అందించాలి

- లేదంటే గడువు పెంచేలా చర్యలు తీసుకోండి
- అలా కుదరని పక్షంలో ఎన్నికలు వాయిదా వేయండి
- కలెక్టర్‌కు కడప ఎంపీ అవినాష్‌రెడ్డి వినతి

సాక్షి కడప : జిల్లాలో ఈనెల 14న జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి నో డ్యూస్ సర్టిఫికెట్ యుద్ధ ప్రాతిపదికన అందించేలా వీఆర్‌ఓలను ఆదేశించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. అందుకు సంబంధించి గురువారం మీడియాకు లేఖ విడుదల చేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా అధికార పార్టీ నాయకులు వీఆర్‌ఓలు నో డ్యూస్ సర్టిఫికెట్లను ఇవ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. పరిస్థితి చూస్తే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంగా తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటర్లకు నీటి పన్ను చెల్లించినట్లుగా నో డ్యూస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం ఒకవైపు చెబుతుండగా, మరోవైపు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన వీఆర్‌ఓలు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోవడం చూస్తే రాజకీయ ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందన్నారు. వేముల మండలంలోని గొల్లలగూడూరు గ్రామానికి చెందిన రైతులు వీఆర్‌ఓ వద్దకు నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం వెళ్లగా అక్కడికి టీడీపీ నాయకుడు ఒకరు వచ్చి పేపర్లు చించి వేశారని, వీఆర్‌ఓతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేయించి అక్కడి నుంచి పంపివేయడం దుర్మార్గమన్నారు. ఇనగలూరు గ్రామ నీటి వినియోగదారుల సంఘం నుంచి దశరథరామిరెడ్డి అనే రైతు వీఆర్‌ఓ వద్దకు వెళ్లగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తొండూరు మండల తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి శివమోహన్‌రెడ్డి ఇంటిలోకి వెళ్లారన్నారు. వేంపల్లె మండలం గిడ్డంగిపల్లెకు చెందిన రైతులు ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకుంటే ఆ సర్టిఫికెట్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రవీంద్రనాథరెడ్డి, మండల ఇన్‌ఛార్జి మునిరెడ్డి చింపి వేశారన్నారు.

రైతులకు వీఆర్‌ఓలు ఏమాత్రం సహకరించకుండా అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటిస్తుంటే ఇక ఎన్నికలు నిర్వహించడం దేనికో అర్థం కావడం లేదన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన సానుభూతి పరులైన రైతులను అడ్డుకోవడం విచారకరమన్నారు. నామినేటెడ్ పదవుల్లాగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంపిక చేసుకుంటే విమర్శలు ఉండేవి కాదు కదా అని విమర్శించారు. జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలని, నో డ్యూస్ సర్టిఫికేట్ కోసం గడువు పెంచాలని లేదంటే ఎన్నికలు వాయిదా వేయాలని ఆయన కోరారు.

• అధికారులపై నాయకుల ఒత్తిడి



రైతులతో కలిసి ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ : మరో రెండు రోజుల్లో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులపై కూటమి నాయకులు ఒత్తిడి చేస్తున్నారని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆరోపించారు. గురువారం సాయంత్రం ఆయన ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ, డీఎస్పీ వెంకటేశ్వరరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నోడ్యూస్ సర్టిఫికెట్ వీఆర్‌ఓలు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. పెద్దముడియం, మైలవరం, జమ్మలమడుగు మండలాలకు సంబంధించి వీఆర్‌ఓలకు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారన్నారు. కొంత మంది వీఆర్‌ఓలను సస్పెండ్ చేయిస్తామంటూ బెదిరించారన్నారు. ప్రస్తుతం చాలామంది అభ్యర్థులు ఉన్నారని వారికి నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇప్పించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కోరారు. దీనిపై ఆర్డీఓ మాట్లాడుతూ శుక్రవారం అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎమ్మెల్సీ వెంట ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు శివగురివిరెడ్డి, రమణారెడ్డి, విశ్వనాథరెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ముల్లా జానీ, భరత్‌రెడ్డి, రుషికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల, ఆర్‌ఓ ప్లాంట్ల వద్ద పరిశుభ్రత పాటించాలి

ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయకుమార్



ట్రిపుల్ ఐటీలో భోజన శాలను పరిశీలిస్తున్న ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయకుమార్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో భోజనశాల, ఆర్‌ఓ ప్లాంట్ల వద్ద పరిశుభ్రత పాటించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయకుమార్ డైరెక్టర్ కుమారస్వామి గుప్తాకు సూచించారు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని పత్రికల్లో వార్తలు రావడంతో గురువారం ఆయన ట్రిపుల్ ఐటీని సందర్శించారు. అనంతరం ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సంద్రలతో కలిసి భోజనశాల, ఆర్‌ఓ ప్లాంట్, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు భోజన శాలలో పాత్రలు, మంచినీరు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. క్యాంపస్‌లోని ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల అస్వస్థత గురించి ఆరా తీశారు. అలాగే విద్యార్థులతో మాట్లాడారు. రెండు నెలలుగా క్యాంపస్‌లో క్యాంటీన్లు, స్టాల్స్ ఎత్తివేశారని అవి త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు. వారంలోపు క్యాంటీన్లు, స్టాల్స్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, అకడమిక్ డీన్ వెంకటేష్, క్యాంపస్ మెయింటెన్ అధికారి అనిల్ కుమార్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బొలేరో వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామసుబ్బారెడ్డి

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం వై.కొత్తపల్లె గ్రామ సమీపంలోని చవ్వారిపల్లె క్రాస్ వద్ద గురువారం ఉదయం బొలేరో వాహనం ఢీకొట్టడంతో కొక్కంటి రామసుబ్బారెడ్డి (73) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ తులసీ నాగ ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి గురువారం ఉదయం పొలం వద్దకు టీవీఎస్ వాహనంపై వెళుతుండగా చవ్వారిపల్లె క్రాస్ రోడ్డు వద్ద లావనూరు నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రామసుబ్బారెడ్డికి తీవ్ర గాయాలై దుర్మరణం చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం

- నేడు 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పేరుతో భారీ ర్యాలీ
- రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి
- అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్ల సమావేశంలో నేతల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : రైతులకు జరిగిన పంట నష్టం, ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయలలో అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు పూర్తయినా ఏ శాఖ సరిగ్గా పనిచేయడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, సోషల్ మీడియా యాక్టివిస్టులను వేధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. ఇప్పటికే 20 మందిని హత్య చేశారని, 300మందిపై హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడకూడదని సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెడుతూ, పాత కేసులను కూడా తిరగదోడుతున్నారన్నారు. వాస్తవాలను ప్రసారం చేసే మీడియా ఛానెళ్లను నిషేధించారని, ప్రజా సమస్యలు, రైతుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా అందించలేదని, అకాల వర్షాల వల్ల ఖరీఫ్, రబీల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఈనెల 13వ తేదీ పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఈ ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మొదటి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

■ మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకం దేశంలోనే సంచలనమన్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు జిల్లాకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. వైఎస్సార్‌ను చూసే ప్రజలు గతంలో కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. కరెంటు చార్జీలు పెంచనని ఊరు, వాడా తిరిగి చెప్పిన చంద్రబాబు, ఆరు నెలల్లోనే 2 సార్లు చార్జీలు పెంచారన్నారు. రైతులకు ఈ ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదని, విత్తనాలు, ఎరువులు, కనీస మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

■ మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి నిధి కింద రూ.13500, గిట్టుబాటు ధర కల్పించామన్నారు. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు, దాని గురించే పట్టించుకోవడం లేదన్నారు. ఎంతసేపు గత ప్రభుత్వంపై నిందలు వేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయిందని, ప్రభుత్వం ఇంతవరకూ కనీస మద్దతు ధర ప్రకటించలేదని, గింజ కూడా కొనుగోలు చేయలేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్, కరిముల్లా గౌస్‌లాజం, నిత్యానందరెడ్డి, రాఘవరెడ్డి, జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్, బంగారు నాగయ్య, పత్తి రాజేశ్వరి, టీపీ వెంకటసుబ్బమ్మ, బి.మరియలు, సుశీలమ్మ పాల్గొన్నారు.

ముగిసిన ఆకేపాటి ఒంటిమిట్ట పాదయాత్ర



ఒంటిమిట్ట క్షేత్రంలో ఆకేపాటితో మాజీ డిప్యూటీ సీఎం, కమలాపురం మాజీ ఎమ్మెల్యే, మేయర్

ఒంటిమిట్ట : అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి 22వ తిరుమల మహా పాదయాత్ర ముగించుకొని చేపట్టిన ఒంటిమిట్ట పదవ మహా పాదయాత్ర ఘనంగా ముగిసింది. గురువారం ఆకేపాడులోని దేవాలయ సముదాయం నుంచి ఎమ్మెల్యే ఆకేపాటి ఒంటిమిట్ట వరకు పాదయాత్ర చేశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి తదితరులు సంఘీభావం ప్రకటించారు. మండల పరిధిలోని మంటపంపల్లి వద్ద జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా ఆకేపాటి పాదయాత్ర కొనసాగించారు. అలాగే వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆయన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి స్వామివారికి తలనీలాలు సమర్పించారు. అనంతరం బాలాలయంలో ఉన్న సీతారామ లక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యానశాఖ మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, ఒంటిమిట్ట, రాజంపేట, నందలూరు, సిద్దవటం మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.